



ప్రగతి నివేదన సభకు భారీగా హాజరైన జనం
(ఇన్ సెట్‌లో.. శంఖం పూరిస్తున్న మంత్రి కేటీఆర్)

# పేదల అభివృద్ధే.. మాకు గీటురాయి

**రంగధాముని చెరువును ట్యాంక్‌బండ్‌గా మారుస్తాం**

**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్**

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 5 : పేదల అభివృద్ధే.. మాకు గీటురాయని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖమంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. రంగధాముని చెరువును మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు అదనపు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రంగధాముని చెరువుగట్టుపై రూ.9.80 కోట్లతో అభివృద్ధి చేసిన రంగధాముని ఫ్రంట్‌లేక్ పార్కును, చెరువు సుందరీకరణలో భాగంగా మురుగునీటి మళ్లింపు కోసం రూ.19.30 కోట్లతో సీవరేజ్ పైప్‌లైన్, అభివృద్ధి పనులను గురువారం మంత్రి కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం కేపీహెచ్‌బీ కాలనీలోని కల్వరి టెంపుల్ రోడ్డులో శ్రీలా పార్కు ప్రైడ్ నుంచి ముళ్లకత్వ చెరువు ఎస్టీపీ వరకు రూ.11.63 కోట్లతో చేపట్టనున్న సీవరేజ్ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత కూకట్‌పల్లి ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రంగధాముని చెరువు 600 మీటర్ల సుందరీకరణ పనులు చేస్తున్నామని, మరో 1.6 కి.మీ. దూరం చెరువు అభివృద్ధికి అదనపు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత, హెచ్ఎండీఏ ఈఈ పద్మ, ఏఈ సంధ్య, కార్పొరేటర్ శిరీషాబాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

### మరోసారి ఆశీర్వదించండి

గతంలో గులాబీ జెండాను చూసి భయపడిన ప్రజలే నేడు ఆ జెండాతోనే ఘన స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కన్న బిడ్డలా, తమ్ముడిలా మీవెంటే ఉన్నానని.. ఉదయం 6 గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన, ఇవ్వని హామీలన్నింటినీ నెరవేర్చానని మరోసారి ఆశీర్వదిస్తే కూకట్‌పల్లిని మరింతగా అభివృద్ధి చేస్తానని ప్రజలను కోరారు.

### చెరువులోకి మురుగునీరు చేరకుండా..

కూకట్‌పల్లి, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా మళ్లించేందుకు గాను చెరువు పక్కనుంచి 1200 ఎంఎం డయా ఆర్‌సీసీ పైపులైన్‌లను వేయనున్నారు. అదేవిధంగా చెరువు చుట్టూరా రెయిలింగ్ ఏర్పాటు, నడక మార్గం (ఫుట్‌పాత్), విద్యుత్ దీపాలు, పచ్చని మొక్కలు, ఇతర సౌకర్యాలను కల్పించనున్నారు. ఈ పనులు పూర్తయితే రంగధాముని చెరువు ట్యాంక్ బండ్ తరహాలో పర్యాటక కేంద్రంగా మారనున్నది. అదేవిధంగా శ్రీలాపార్కు ప్రైడ్ నుంచి ఎస్ఎంఆర్ వినయ్, డ్రీమ్‌వ్యాలీ కాలనీ, గోపాల్‌నగర్ మీదుగా ముళ్లకత్వ చెరువు ఎస్టీపీ వరకు 450/600/800/900 ఎంఎం డయా సామర్థ్యాలతో కూడిన ఆర్‌సీసీ పైప్‌లను వేయనున్నారు. దీంతో ఆయా కాలనీల పరిధిలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించనున్నది.

### ఫ్రంట్‌లేక్ పార్కు

ఫ్రంట్‌లేక్ పార్కును సకల వసతులతో అభివృద్ధి చేశారు. చెరువుగట్టుపై ఫేవర్ బ్లాక్స్‌తో పాత్‌వేలు, ఫ్లోరింగ్, స్టెప్డ్ అండ్ క్యూబికల్ సీటింగ్, శిల్పాలు, విద్యుత్ లైటింగ్, టాయిలెట్ బ్లాక్, సాఫ్ట్ స్కేప్‌ను ఏర్పాటు చేశారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



రంగధాముని చెరువుపై అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, తదితరులు

## హెచ్‌సీఏలో దోపిడీని ఆపాలి

**వి.హనుమంతరావు వినతి**

హైదరాబాద్, ఆట ప్రతినిధి, అక్టోబర్ 5 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో విశాఖ కంపెనీ దోపిడీని నివారించి ఆ ధనంతో జిల్లాల్లో క్రికెట్ స్టేడియాలను నిర్మించాలని మాజీ క్రీడల మంత్రి వి.హనుమంతరావు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైనమిక్ లీడర్, మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకొని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లోని దోపిడీని ఆపాలని డిమాండ్ చేశారు. విశాఖ కంపెనీ నాలుగు కోట్లు ఇచ్చి 17 కోట్లు దోపిడీ చేసిందని ఇంకా 53 కోట్లు ఇవ్వాలని కోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చిందని చెప్పారు. బీసీసీఐ ద్వారా వచ్చే దనాన్ని తెలంగాణలోని యువతరానికి ఉపయోగపడే విధంగా ప్రతి జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియాలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌సీఏలోని వివిధ క్లబ్ కార్యదర్శులు శేషు నారాయణ, పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఖోఖో తెలంగాణ జట్టు

హైదరాబాద్ ఆట ప్రతినిధి, అక్టోబర్ 5 : జాతీయ ఖోఖో చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్లకు తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ కిట్లను పంపిణీ చేశారు. ఎల్బీస్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి పోచప్ప పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర జూనియర్ ఖోఖో జట్టులో ఎం.శ్రీలక్ష్మి, ఈ.మైథిలి, ఎన్.శ్రీవాణి, టి.శ్రావణి, బి.స్వప్న, ఎం.జానకి, కె.దేవిక, ఎ.శ్రీవల్లి, పి.చందన, పి.అంజనీ, పి.సంగీత, ఎస్.విజయలక్ష్మి, వి.సింధు ఉన్నారు.

## దసరా, దీపావళి ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : దసరా, దీపావళి పండుగ సందర్భంగా.. పది ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ గురువారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 13 నుంచి డిసెంబర్ 29 వరకు తేదీల వారీగా ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు తెలిపారు.

## కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సల్లో
# మొదటి స్థానంలో సనత్‌నగర్ ఈఎస్ఐసీ

**ఈఎస్ఐసీ మెడికల్ కమిషనర్ డాక్టర్ సునీత చోప్రా**

అమీర్‌పేట్, అక్టోబర్ 5: కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సల్లో దేశంలోనే సనత్‌నగర్ (ఈఎస్ఐసీ) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మొదటి స్థానంలో ఉన్నదని ఈఎస్ఐసీ దక్షిణ మండలం మెడికల్ కమిషనర్ డాక్టర్ సునీత చోప్రా అన్నారు. ప్రైవేటు దవాఖానల్లో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సకు లక్షలు వెచ్చించాల్సి వస్తున్నదని, ఈఎస్ఐ కార్డు కలిగిన వారికి ఉచితంగా చికిత్స అందించి ఔషధాలు అందచేస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరుగుతున్న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పరిశీలించే కార్యక్రమాల్లో భాగంగా ఆమె గురువారం సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిని సందర్శించారు. 2021 నవంబర్ నుంచి ఇప్పటి వరకు 10 శస్త్ర చికిత్సలు విజయవంతం కావడం పట్ల ఆమె ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి కాటే, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాధికను అభినందించారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయం చేయడంలో తమ వంతు బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తున్న ఈఎస్ఐసీ నెఫ్రాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ధనలక్ష్మి, వైద్యులు డాక్టర్ దీప్తి, డాక్టర్ లలిత, డాక్టర్ కార్తీక్, ట్రాన్స్‌ప్లాంట్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండురంగారెడ్డి, డాక్టర్ రవీందర్‌రెడ్డిలతో పాటు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ విభాగం నర్సింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి రత్నమ్మలను మెడికల్ కమిషనర్ డాక్టర్ సునీత చోప్రా ప్రత్యేకంగా అభినందించారు.



కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో మెడికల్ కమిషనర్ డాక్టర్ సునీతా చోప్రా, డీన్ డాక్టర్ మాధురి కాటే, ఎం.ఎస్ డాక్టర్ ఎం.రాధిక, తదితరులు